సెలవయ్యా.. గణపయ్యా

● ఘనంగా నిమజ్జనోత్సవం

కల్వకుర్తి రూరల్/ కల్వకుర్తి, సెప్టెంబర్ 16 : కల్వకుర్తి పట్టణంలో సోమవారం వినాయక నిమజ్జనోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రుల పాటు వినాయకుడికి నిత్యపూజలందించిన భక్తులు సోమవారం సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించి నిమజ్జనోత్సవానికి తరలించారు. సీతారామాంజనేయ స్వామి ఆలయం నుంచి వినాయక విగ్రహాలు ఒకొక్కటిగా బయలుదేరి బస్టాండ్ పాలమూరు చౌరస్తా, హైదరాబాద్ చౌరస్తాల మీదుగా ఊరేగింపు చేశారు. నిమజ్జనోత్సవంలో ఎక్కడా ఘర్షణ వాతావరణం లేకుండా ముందు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఊరేగింపులో భాగంగా భక్తులు భజనలు, కోలాటాలు, నృత్యాలు చేసుకుంటూ వినాయక విగ్రహాలను పట్టణ సమీపంలోని కుంటలో నిమజ్జనం చేశారు. వాసవీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో వినాయకుని వద్ద లడ్డూ వేలంపాటలో జూలూరి సత్యనారాయణ రూ.20,116, రెండోలడ్డూ రవి రూ.16,116కు, వినాయకుని కండువాను జగదీశ్వర్‌రూ.10,116కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయట్రస్ట్ చైర్మన్ రమేశ్ బాబు, ఆర్యవైశ్య, వాసవీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు. విద్యానగర్ (కేశవనగర్) కాలనీలో వినాయక మండలి వద్ద జరిగిన లడ్డూ వేలంపాట రికార్డుస్థాయిలో సాగింది. మొదటి లడ్డూను డాక్టర్‌బాలు రూ.లక్షాపదహారు వేలకు దక్కించుకోగా రెండో లడ్డూను శ్రీనివాస్‌గౌడ్ రూ.52వేలకు స్వామివారి పెద్దపంచ, కండువాను జయప్రద రూ.26వేలకు, చినకండువాను రవీందర్‌రెడ్డి రూ.14వేలు , పండ్లను నర్సింహ రూ. 23,600 దక్కించుకున్నారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 16 : మండలంలోని పోతిరెడ్డిపల్లి, కోడుపర్తి గ్రామాల్లో సోమవారం గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గణనాథులను అందంగా ఆలంకరించిన వాహనాల్లో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. బాజాలు, పటాసుల మోతల మధ్య యువకుల నృత్యాలు, భజనలు, కోలాటాలు, మహిళల బొడ్డెమ్మల మధ్య ఊరేగింపు నిర్వహించారు. గ్రామాల్లో ప్రధానవీధుల గూండా గణనాథులను తిప్పుతూ నిమజ్జనానికి తరలించారు.

కల్వకుర్తిలో వాసవీ ఆలయంలో లడ్డు దక్కించుకున్న భక్తుడు

కల్వకుర్తి :విద్యానగర్‌లో అన్నదానం చేస్తున్న మహిళలు

తిమ్మాజిపేట : పోతిరెడ్డిపల్లిలో నిమజ్జనానికి సిద్ధమైన గణేషునితో స్థానికులు

కల్వకుర్తిలో నిమజ్జనానికి తరలుతున్న వీరబ్రహ్మం ఆలయం వీది భారీ గణపతి

లక్ష్మారెడ్డిని పరామర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే

శ్వేతారెడ్డి చిత్రపటం వద్ద నివాళుర్పించిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

తిమ్మాజిపేట,సెప్టెంబర్ 16 : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆయన కుటుంబ సభ్యులను సోమవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పరామర్శించారు. మండలంలోని ఆవంచలోని ఆయనఇంటికి చేరుకుని శ్వేతారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు పద్మజారెడ్డి, బాలత్రిపురసుందరి, విష్ణువర్ధన్‌రెడ్డి, సాహితిలు లక్ష్మారెడ్డిని కలిసి సంతాపం వ్యక్తం చేశారు.

ఊర్కొండ బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

ఊర్కొండ, ఆగస్టు 16 : మండలంలోని రాంరెడ్డిపల్లి, బొమ్మరాజుపల్లి బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డిని ఆవంచలో ఆయన సతీమణి శ్వేత చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీఎంపీటీసీలు గోపాల్‌గుప్తా, వెంకటేశ్, మాజీ సర్పంచ్ శేఖర్, తిరుపతిరెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, తిరుపతి, రాఘవేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ డీకే అరుణ

లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న ఊర్కొండ బీఆర్ఎస్ నాయకులు

నేడు కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవం

- పతాకావిష్కరణ చేయనున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- నాగర్‌కర్నూల్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సంతోశ్, అదనపు ఎస్పీ రామేశ్వర్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 16 : ప్రజాపాలన దినోత్సవాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ సంతోశ్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం 9:45 గంటలకు ఎస్పీ కార్యాలయంలో, 9:50 గంటలకు కలెక్టరేట్, జిల్లామెజిస్ట్రేట్ పతాకావిష్కరణ చేయనున్న ట్లు తెలిపారు. 9:55గంటలకు ముఖ్యఅతిథిగా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కలెక్టరేట్‌లో జాతీయజెండాను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం ముఖ్యఅతిథిగా సందేశం ఉంటుందన్నారు. అంతకుముందు పోలీసుల గౌరవం వందనం స్వీకరించనున్నారు. అనంతరం ఉదయం 10:30 గంటలకు జిల్లాలోని పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, 10:50 గంటలకు వందన సమర్పణ ఉంటుందని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరుకావాలన్నారు.

రైతుభరోసా నిధులను విడుదల చేయాలి

బిజినేపల్లి, సెప్టెంబర్ 16 : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం శాఖ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు, వాగ్దానాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రైతుబంధును రైతుభరోసాగా మార్చి ఎకరాకు రూ.15వేలు ఇస్తామని, ఇప్పటివరకు మొదటివిడుత రైతుభరోసా నిధులు విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. దీంతో రైతులు పెట్టుబడి సాయం అందక అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. అనంతరం సీపీఎం జాతీయ నాయకుడు సీతారాం ఏచూరి మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అశోక్, హన్మంతు, చంద్రశేఖర్, మల్లేశ్, నరేష్, మహమూద్ తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 16 : మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, పేద ప్రజలకు అందుతున్న సేవలను ఏఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని యాపట్ల సబ్‌సెంటర్‌ను తనిఖీ చేసిన గ్రామంలో డెంగ్యూవ్యాధి సోకినవారిని పరామర్శించి వారికి అందుతున్న వైద్య సదుపాయాలను తెలుసుకున్నారు. గ్రామాల్లో అనారోగ్యానికి గురికాకుండా ముందస్తుగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దవాఖాన సిబ్బంది లక్ష్మీనర్సింహాగౌడ్, ఏఎన్ఎం తదితరులు ఉన్నారు.

చేపపిల్లల తయారీకేంద్రం పరిశీలన

చేపపిల్లల కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

బిజినేపల్లి, సెప్టెంబర్ 16 : మండలంలోని ఖానాపూర్‌లో 60 ఎకరాల్లో ఏర్పాటు చేసిన చేపపిల్లల తయారీ కేంద్రాన్ని సోమవారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నిరోజులుగా ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ప్రతిచెరువు, కుంటలు నిండుకుండల్లా ఉన్నాయన్నారు. మత్స్యకారులు చేపపిల్లలను చెరువులో వదులుకునేందుకు అనువైనదన్నారు. చెరువులో చేపపిల్లలను మత్స్యకారులు వదులుకోవాలని కోరారు. చేపపిల్లలు గతంలో ఆంధ్రప్రదేశ్ వెళ్లి తెచ్చుకునేవారమని, ప్రస్తుతం సమీపంలోని ఖానాపూర్‌లో చేపపిల్లలను పెంచడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో అల్లోజీ, నర్సింహ, బంగారయ్య, వెంకటయ్య, భానుచందర్, రాము తదితరులు ఉన్నారు.

రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ విఫలం

వంగూరు, సెప్టెంబర్ 16 : రైతులకు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్‌రావు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న మంత్రులకు గ్రామాల్లో మాఫీకానీ రైతుల ఆవేదన వారు గుర్తించకపోవడం శోచనీయమన్నారు. రూ.2.లక్షలకు పైగా రుణాలు పొందిన రైతులు పైన వున్న అసలుతో పాటు వడ్డీ కట్టించుకున్న రూ.2లక్షలు ఇంతవరకు వారీ ఖాతాల్లో జమ చేయలేదన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ పొందని రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు.

20న ఉపముఖ్యమంత్రి రాక

అచ్చంపేట రూరల్, సెప్టెంబర్ 16 : ఈనెల 20న మన్నెవారిపల్లి ఎస్ఎల్‌బీసీ పరిశీలనకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రానున్నారు. సోమవారం సాయంత్రం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు చేశారు.

మానవులంతా సమానమని చాటిన ప్రవక్త

అచ్చంపేటలో శాంతిర్యాలీలో పాల్గొన్న ముస్లిం సోదరులు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 16 : సమాజంలోని మానవులంతా సమానమని చాటిన గొప్ప మహ్మద్ ప్రవక్త ముస్లిం మైనార్టీ నాయకులు మహ్మద్ హబీబుర్ రహెమాన్, హబీబ్‌ఖాన్, ఖాదర్ అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ఖాదర్ సారథ్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో రోగులకు, బాలింతలకు పండ్లు, బ్రెడ్లు, చిన్న పిల్లలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మహ్మద్‌నిజామ్, సీనియర్ జర్నలిస్టు అహ్మదుల్లాఖాన్, మదర్సా కమిటీ సభ్యులు అలీమ్, ఇస్మాయిల్, ఖాజాబాబా, జహంగీర్, రహమాన్‌ఖాన్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్‌లో..

అమ్రాబాద్, సెప్టెంబర్ 16 : అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లో మహ్మద్ ప్రవక్త జయంతి వేడులకను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ముస్లిం సోదరులు నమాజ్ ముగించుకొని స్థానిక ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీద్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయక్ సర్దార్, సోఫీ, జావిద్, ముఖ్రమ్, జహంగీర్, అలీపాషా, జబ్బార్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి

అచ్చంపేట రూరల్, సెప్టెంబర్ 16 : ముస్లిం సోదరులు మిలాద్ ఉన్‌నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జామీయా మసీదు వద్ద ప్రత్యేక నమాజ్ చేశారు. అనంతరం ముస్లిం సోదరులను మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులుతో కలిసి శాంతిర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హఫీజ్, మహ్మద్‌గౌస్, అక్బర్ అధ్యక్షుడు సిద్దిఖీ, ప్రధాన కార్యదర్శి ఖాజ, మతపెద్దలు, ఖాసీం, అజ్మత్, మన్సూర్‌ఖాన్, సాజిద్, ఉమర్, రఫీ, మహబూబ్ అలీ, ఖాదర్, హాజీపాషా పాల్గొన్నారు.

వెల్దండలో..

వెల్దండ, సెప్టెంబర్ 16 : ముస్లిం సోదరులు ఈద్ మిలాద్-ఉన్ నబీని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదునుంచి ఈద్గా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇచ్చిన హామీమేరకు రూ. 5లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, మోతిలాల్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మసీద్ కమిటీ అధ్యక్షుడు సాధిక్, రషీద్, అఫ్రోజ్, సుల్తాన్, అహ్మద్ ఉన్నారు.

లింగాలలో..

లింగాల, సెప్టెంబర్ 16 : మండలంలో మిలాద్ ఉన్‌నబీ వేడుకలను సోమవారం ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకొని మండలంలోని అంబట్‌పల్లి, లింగాల తదితర మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 16 : పెద్దకొత్తపల్లిలో మహ్మద్ ప్రవక్త జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ చౌరస్తాలో మైనార్టీ అధ్యక్షుడు మైను ప్రజలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాబు మియా, సుల్తాన్, బాలెమియా పాల్గొన్నారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 16 : మండలంలో మిలాద్ ఉన్‌నబీ పండగను ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు గుమ్మకొండ, గొరిట, ఆవంచ తదితర గ్రామాల్లో ఉదయం మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.


వెల్దండలో ముస్లిం సోదరులతో ఎమ్మెల్యే కశిరెడ్డి

నాగర్‌కర్నూల్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న ముస్లింలు

అమ్రాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ సెప్టెంబర్ 16 : పేదప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పీహెచ్‌సీని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీచేశారు. మందులు, వైద్యసేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సిబ్బంది కొరతలేకుండా చూడాలని డిప్యూటీ డీఎంహెచ్‌వోను ఆదేశించారు. బదిలీపై వెళ్తున్న మోడల్‌స్కూల్ అధ్యాపకులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్‌కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటయ్యగౌడ్, మోతిలాల్, వైద్య సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు పరామర్శ

వెల్దండ, సెప్టెంబర్ 16 : మండలంలోని పోతెపల్లి గ్రామంలో కొమ్మువెంకటయ్య అనే బీఆర్ఎస్ కార్యకర్త గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు కొండల్‌యాదవ్ బాధితుడి ఇంటికి చేరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రూ.3వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మార్కండయ్య, తాండ్రశ్రీను, ఆంజనేయులు, శేఖర్, వరుణ్‌కుమార్ ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తను పరామర్శిస్తున్న కొండల్‌యాదవ్

కేశవనగర్ కాలనీ కమిటీ ఎన్నిక

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్16 : పట్టణం విద్యానగర్(కేశవనగర్‌కాలనీ) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లిఖార్జున్, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా జగన్‌ను కాలనీ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

సంస్థాగతంగానే రాజ్యాధికారం సాధ్యం

అచ్చంపేట రూరల్, సెప్టెంబర్ 16 : బీజేపీ ముందుగా సంస్థాగతంగా బలపడినప్పుడే తెలంగాణలో రాజ్యాధికారానికి చేరువవుతుందని సభ్యత్వ ఇన్‌చార్జి కొప్పుల బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గస్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన మాజీఎంపీ రాములుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సుధాకర్‌రెడ్డి, నరేందర్‌రావు, సోలంకి శ్రీనివాసమంగ్యానాయక్, మండికారిబాలాజీ, జిల్లా నాయకులు నాగరాజు, శ్రీనూనాయక్, కొండల్‌రెడ్డి, ధర్మానాయక్, సైదులుయాదవ్, గణేష్‌మోడి, రవీందర్‌రెడ్డి, చందులాల్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి ఆర్థికసాయం

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 16 : పోతులూరి వీరబ్రహ్మం ఆలయాభివృద్ధికి పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు మధు ఆర్థిక సాయం అందించారు. ఆలయాభివృద్ధికి రూ.50,520 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాలాచారి, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, రమేశ్‌చారి, శ్రీనివాసాచారి, మల్లేష్ పాల్గొన్నారు.

సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలి

కోడేరు సెప్టెంబర్ 16 : భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణసాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నరసింహ పిలుపునిచ్చారు. కోడేరులోని బస్టాండ్‌కూడలిలో సోమవారం సాయుధ రైతాంగ పోరాట వారోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రవి, రాజేష్, వి,రవి, చంద్రయ్య, పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.10 లక్షలు

కొల్లాపూర్, సెప్టెంబరు 16 : మండలంలోని సింగోటం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు హుండీ లెక్కింపు చేపట్టారు. ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ బాలాదిత్య లక్ష్మణరావు, ఈవో రంగారావు పర్యవేక్షణలో హుండీ లెక్కింపును ప్రారంభించారు. రూ.10,29,523 నగదు, 1200 గ్రాముల వెండి ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

బిజినేపల్లి, సెప్టెంబర్ 16 : బిజినేపల్లిలో సోమవారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపును నిర్వహించారు. విశ్వకర్మ జయంతిలో ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు.

నేడు విశ్వకర్మ జయంతి వేడుకలు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 16 : విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రసాస్వామి ఆలయంలో మంగళవారం విశ్వకర్మ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారు జాము ప్రత్యేక పూజలు చేస్తా మన్నారు. అనంతరం బులియన్ మర్చంట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

ఊరేగింపులో భజనలు చేస్తున్న భక్తులు

వృద్ధుడు ఆత్మహత్య

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 16 : మండలంలోని బుద్దసముద్రం గ్రామంలో వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన నారాయణగౌడ్(70) సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగాడు. వెంటనే కుటుంబసభ్యులు జడ్చర్ల దవాఖానకు తరలించగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కండ్లు కనిపించవని, కొన్నాళ్లకిందట కుమారుడు మృతి చెందడంతో మానసికంగా కృంగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుమార్తె అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి మాజీఎమ్మెల్యే బీరం పరామర్శ

జనార్దన్‌గౌడ్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం

కోడేరు, సెప్టెంబర్ 16 : మండలంలోని ముత్తిరెడ్డిపల్లికి చెందిన బండారు జనార్దన్‌గౌడ్ గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వెళ్లి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఐఎఫ్‌డబ్ల్యూజే సమావేశాలను జయప్రదం చేయాలి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 16 : ఈనెల 28 నుండి 30వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మథుర పట్టణంలో నిర్వహిస్తున్న ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు(ఐఎఫ్‌డబ్ల్యూజె) జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి కాలూరి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో జరిగిన కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులు, బాధ్యతలు తదితర అంశాలపై జాతీయ కౌన్సిల్ సమావేశం లో చర్చించడం జరుగుతుందన్నారు. భారత రాజ్యాంగం లో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ నుంచి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు అధికసంఖ్యలో పాల్గొని జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు దుమర్ల భాస్కర్, ఉపాధ్యక్షుడు గువ్వ వరప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాదం పరమేశ్ ఉన్నారు.

నవోదయ ప్రవేశపరీక్ష దరఖాస్తుల గడువు పొడిగింపు

బిజినేపల్లి, సెప్టెంబర్ 16 : వట్టెం గ్రామంలో జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరం ఆరోతరగతి ప్రవేశ పరీక్షకోసం దరఖాస్తుల తేదీని ఈనెల 23వరకు పొడిగించినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ భాస్కర్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతూ స్థానికులై ఉండాలని పేర్కొన్నారు. కాగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారాలను సమర్పించవచ్చన్నారు.

గృహజ్యోతి పథకానికి దరఖాస్తులు

అచ్చంపేట రూరల్, సెప్టెంబర్ 16 : గృహజ్యోతి ఉచిత విద్యుత్ అమలులో భాగంగా అమలుకాని వినియోగదారులకు ఈనెల 17 నుంచి జరిగే మరోవిడుత ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ ఏఈ ఆంజనేయులు సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని 38 గ్రామాలకు చెందిన వినియోగదారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణంలోని 20వ వార్డు వినియోగదారులు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోని జీరో కరెంట్ బిల్లులను పొందగలరని ఆయన కోరారు.